క్లుప్తంగా

అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులు



ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

పెద్దపంజాణీ: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.29.80 లక్షల నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు(వాసు) తెలిపారు. వి.కోటలోని ఆయన నివాసంలో శనివారం కలిసిన పెద్దపంజాణీ మండల వైఎస్సార్‌సీపీ నాయకులకు ఉత్తర్వుల కాపీని అందజేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నిడిగుంట సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, పార్టీ నాయకులు అమరనాథరెడ్డి, జాఫర్, ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

రొంపిచెర్ల: మండలంలో రూ.6 కోట్లతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్సీ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం జాండ్లవారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీలో స్థల పరిశీలన చేశారు. మండలంలో ఇప్పటికే మోటుమల్లెల, బండకిందపల్లె గ్రామాల్లో రెండు సబ్ స్టేషన్లు నిర్మించామన్నారు. ఆయన వెంట ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంఖాన్, డీఈ దామోదర్, ఏడీఏ రమేష్, తహసీల్దార్ అమరనాథ్ ఉన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంలో స్థానికులు

కుప్పంరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శీగలపల్లి గ్రామంలో శనివారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను 2వ వార్డు కౌన్సిలర్ మునిరాజు ప్రారంభించారు. ఇది వరకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక కౌన్సిలర్ మునిరాజు రెస్కో అధికారులతో చర్చించి, చైర్మన్ సెంథిల్‌కుమార్ సహకారంతో మరో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ సమస్యలు తీరినట్లు అయ్యింది.

మామిడి తోటల్లో బంక తెగులు



తెగులును పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

పులిచెర్ల(కల్లూరు): ప్రస్తుతం మామిడి తోటల్లో కొత్త చిగురు వస్తున్నందున బంక తెగులు ఎక్కువగా ఆశించే వీలుందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదనరెడ్డి తెలిపారు. శనివారం మంగళంపేటలోని మామిడి తోపులను ఆయన పరిశీలించారు. లేత ఆకులకు బంక రాకుండా ఉండేందుకు ఒక లీటరు నీటిలో 40 మిల్లీల మెట్రోజోమ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్తలు రెడ్డిరాం, రాఘవేంద్ర ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



భోజనాన్ని పరిశీలిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి

సోమల: విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటిస్తూ మెనూ ప్రకారం వడ్డించాలని చిత్తూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. శనివారం సోమల మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇదే పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్పంచ్ మసూద్, సచివాలయ కన్వీనర్ పగడాల శివ, పంచాయతీ కార్యదర్శి జైశంకర్, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఉలవసాగు.. ఆదాయం బాగు

- ఖరీఫ్‌లో వేరుశనగ వేయని వారికి మంచి ప్రత్యామ్నాయం
- ఇప్పటికే 80 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా
- మూడు నెలల్లోనే పంట చేతికి..
- రైతుకు అదనపు ఆదాయం, పశువులకు మేతగా వినియోగం



పలమనేరులో ఉలవలు చల్లేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ఖరీఫ్ దుక్కులు దున్ని వేరుశనగను సాగుచేయలేని రైతులతో పాటు వేరుశనగ ఒబ్బిళ్లు చేసుకున్న రైతులకు ఉలవసాగు ప్రత్యామ్నాయ పంటగా మారింది. నామమాత్రపు పెట్టుబడి, ఎలాంటి పురుగు మందులు, ఎరువులు లేకుండా కేవలం వర్షాధారంగా మూడు నెలల్లో దిగుబడినిచ్చే పంట కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పాడిపశువులకు మేతగా ఉపయోగపడుతుంది. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతు భరోసా కేంద్రాల ద్వారా 75 శాతం రాయితీతో రైతులకు ఉలవ విత్తనాలను పంపిణీ చేసింది. గతంలో వేరుశనగ కోసం దుక్కులు దున్ని ఆ సమయంలో వర్షం లేక విత్తనాలేయని వారు ఇప్పటికే ఉలవ విత్తనాలు దుక్కుల్లో చల్లుకున్నారు. మరికొందరు ఈనెల ఆరంభం నుంచి విత్తనాలేస్తున్నారు. మూడో దఫాగా వేరుశనగ పంట ఒబ్బిడి చేశాక చాలా మంది రైతులు అదే పొలాల్లో ఉలవలను వేస్తుంటారు.



ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తనాలు

ఈ దఫా పెరగనున్న ఉలవ సాగు

గతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా సగానికి పైగా రైతులు వేరుశనగ విత్తనాలు వేయలేదు. వీరు ఇప్పుడు ఉలవలు వేసుకుంటున్నారు. వేరుశనగ వేసిన వారు పంట పూర్తయ్యాక ఉలవను చల్లుకోవచ్చు. ఉలవలు క్వింటాలు రూ.10,800 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.8,640, రైతు వాటాగా రూ.2,160తో ఇటీవల వ్యవసాయశాఖ 994 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు పంపిణీ చేసింది. వీటిలో 10 శాతం మంది ఇప్పటికే విత్తనాలను వేశారు. మరో 20 శాతం మంది ఇప్పుడు విత్తనాలేస్తున్నారు. మిగిలిన వారు వేరుశనగ పంట ఒబ్బిడి చేసి సీజన్ ముగిసేలోపు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

నిఖర లాభాలు

ప్రస్తుతం మార్కెట్‌లో ఉలవ క్వింటాలు రూ. 11 వేలుగా ఉంది. ఎకరాలో ఉలవ బాగా పండితే నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఆ లెక్కన ఎకరానికి రూ.44 వేలు గిట్టుబాటు అవుతుంది. పంటసాగు కోసం ఎరువులు, క్రిమిసంహార మందులు, కలుపు నివారణ లాంటివి ఉండవు. పంటను ఒడిపే సమయంలో కూలీల ఖర్చు తప్పా రైతుకు పెట్టుబడి ఉండదు. ముఖ్యంగా ఇది వర్షాధారంగానే పండుతుంది. కేవలం మూడు నెలల్లో పంట చేతికొస్తుంది. అందుకే రైతులకు ఇది గ్యారెంటీ లాభాల పంటగా మారింది. పంట వడుపుకున్నాక పశువులకు మంచి ఎండుమేతగా ఉపయోగపడుతుంది. పశువులకు మంచి బలవర్థకమైన ఆహారం. ఫలితంగా పాల దిగుబడి పెరుగుతుంది.

ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు ఇలా..

- ప్రభుత్వం సబ్సిడీతో అందజేసిన వేరుశనగ విత్తనాలు:994 టన్నులు
- డివిజన్‌లో సాధారణ వేరుశనగ సాగు:14,388 హెక్టార్లు
- ప్రస్తుతం సాగైన విస్తీర్ణం: 6,700 హెక్టార్లు
- దుక్కులు దున్ని వేరుశనగ వేయని విస్తీర్ణం: 4 వేల హెక్టార్లు
- వ్యవసాయశాఖ పంపిణీ చేసిన ఉలవల విత్తనాలు: 994 క్వింటాళ్లు
- ఎకరానికి అవసరమైన విత్తనాలు: 10 నుంచి 12 కిలోలు
- ఉలవ సీజన్: సెప్టెంబర్ నుంచి నవంబర్ తొలివారం వరకు
- ఎకరాకు వచ్చే దిగుబడి: 4 క్వింటాళ్లు



సాగులో ఉన్న ఉలవ పంట

నాలుగు ఎకరాల్లో సాగు చేశా



వేరుశనగ కోసం దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నాక అదునులో వర్షం రాక చేను బీడుగా మారింది. ఈ మధ్య ప్రభుత్వం ఉలవలను పంపిణీ చేయగా తెచ్చి నాలుగు ఎకరాల్లో సాగుచేశా. మూడు నెలల్లో పంట చేతికొస్తుంది. ఖర్చులేని పంట కాబట్టి ఎంత వచ్చినా రాబడేకదా. ముఖ్యంగా పశువులకు మంచి మేత వస్తుంది.

–విజయ్‌నాయుడు, ముసలిమడుగు

రైతుకు ఎంతో మేలు



ఈ దఫా డివిజన్‌లో సబ్సిడీపై రైతులకు ఉలవ విత్తనాలను పంపిణీ చేశాం. కొందరు రైతులు ముందస్తుగా విత్తనాలను చల్లుకున్నారు. నవంబర్ తొలివారం వరకు సీజన్ ఉంటుంది. ఏ పంట వేయని వారు ఉలవను వేసుకుంటే లాభం ఉంటుంది. ఇది పెట్టుబడి లేని చౌకైన పంట. కాబట్టి రైతులు ఎక్కువగా ఉలవను సాగు చేసేలా చూస్తున్నాం.

–అన్నపూర్ణదేవి, ఏడీ అగ్రికల్చర్, పలమనేరు డివిజన్

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

రొంపిచెర్ల: వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో విగ్రహాలను పెట్టేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. వినాయక విగ్రహాలను మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు పెట్టరాదన్నారు. ఎలాంటి గొడవలు జరిగినా నిర్వాహకులదే బాధ్యత అన్నారు. నిర్వాహకుల పేర్లను స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

గంగవరం: నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా రహదారులు, వీధుల మధ్య విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. అలాగే రాత్రి 10 గంటల తరువాత సౌండ్ సిస్టమ్, మైక్‌లు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రజారోగ్యమే సురక్ష లక్ష్యం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చరణ్

సదుం: ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడమే జగనన్న సురక్ష ఉద్దేశమని ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. సదుంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేలో చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ చరణ్ శనివారం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సర్వే నిర్వహిస్తున్న వారికి తెలియజేయాలని కోరారు.

నవరత్నాలతో పేదల ఆర్థికాభ్యున్నతి



మహిళలకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- జగనన్న చేసిన మంచిని ఆశీర్వదించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: నవరత్నాల పథకాలతో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని.. వారి అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..నవరత్నాలతో ప్రతి కుటుంబంలో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. వివిధ పథకాల ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగనన్నదేనని అన్నారు. ముఖ్యంగా పిల్లలు భవిష్యత్తు బాగుపడాలని విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేశారని చెప్పారు. నాణ్యమైన విద్య అందిస్తున్నారని..పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడితో తల్లిదండ్రులకు చేయూత ఇస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికి మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి పలు సమస్యలు

5వ వార్డులోని తంబిగానిపల్లిలో మహిళలు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. పలు సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అయ్యిందని.. త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని భరత్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈగా శ్రీనివాసమూర్తి



పుంగనూరు: పుంగనూరు ట్రాన్స్‌కో డీఈగా కె.శ్రీనివాసమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విజయన్ పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చిత్తూరు నుంచి శ్రీనివాసమూర్తి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఏడీ రవి, ఏఈలు శశికుమార్, ధనుంజయమూర్తి, సిబ్బంది నూతన డీఈని కలసి శుభాకాంక్షలు తెలిపారు. డీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నూతన పెన్షన్‌దారులతో ఎంపీపీ

పుంగనూరు: మండలంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం మంగళం గ్రామంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు భూమి కేటాయింపునకు నివేదిక

పుంగనూరు: బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 15 సెంట్ల భూమి కేటాయింపునకు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దార్ సీతారామన్ తెలిపారు. బ్రాహ్మణుల కోరిక మేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి స్పందించారన్నారు. ఈ మేరకు కమ్యూనిటీ హాల్, తదితర నిర్మాణాలకు భూమిని కేటాయించాలని ఆదేశించారన్నారు. కుమ్మరనత్తం గ్రామదాఖల సర్వే నంబర్ 329లో 15 సెంట్ల భూమిని కేటాయిస్తూ నివేదికలను కలెక్టర్‌కు పంపామన్నారు. కలెక్టర్ నిర్ణయం మేరకు భూమిని కేటాయిస్తామన్నారు.

నేడు ఏపీజీఈఎఫ్ సమావేశం

కుప్పంరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్), పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి మల్లీశ్వరన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బీసీఎన్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని చెప్పారు. ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం సభ్యులు హాజరుకావాలని కోరారు.

సన్మానం



పలమనేరు: శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులుగా నియమితులైన పాకాల డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మొహిదీన్‌బాషా, చిత్తూరు మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సంధ్యారాణిలను స్థానిక వడ్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పూజిద్దాం



పుంగనూరు: మట్టి ప్రతిమలతో విద్యార్థులు

పెద్దపంజాణీ: రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడకుండా మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని హెచ్‌ఎం బాబు రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయురాలు మీనాక్షి అన్నారు. శనివారం నాగిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులతో మట్టి విగ్రహాలు తయారు చేయించి గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా రాయలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ చేశారు. మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజప్ప, మాధవన్, గంగాధర్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల తయారీపై పోటీలు

శాంతిపురం: కూతేగానిపల్లిలోని శ్రీపరమహంస యోగానంద పాఠశాలలో విద్యార్థులకు మట్టితో వినాయకుడి విగ్రహాల తయారీపై శనివారం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పర్యావరణానికి హాని చేయని రీతిలో పండుగ నిర్వహణపై విద్యార్థుల్లో చైతన్యం తెచ్చేందుకు పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ తెలిపారు.



శాంతిపురంలో..

మట్టి విగ్రహాలు పంపిణీ

పుంగనూరు: పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి వినాయకులను పూజిద్దామని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. శనివారం హైస్కూల్‌లో మట్టి వినాయకులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రజిని, హరిప్రియ, జలజ, శ్రావణి, రెడ్డెమ్మ, మునిరత్నం పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక



పెద్దపంజాణీ: మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు



పుంగనూరు: అడవినాథునికుంటలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పెద్దపంజాణీ: అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో శనివారం 14–17 ఏళ్లలోపు బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, యోగాలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీపీఎస్.రెడ్డెప్ప, బాగా రెడ్డి, హెచ్‌ఎం నందకుమార్, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ చంద్రా రెడ్డి, పీడీలు అన్నాదొరై, హరి, తులసిరెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

ఆటల పోటీలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈఓ తెలిపారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంఈఓలు సిద్ధారామయ్య, తాతయ్య, నాథమునిరెడ్డి, గోవిందరెడ్డి, హెచ్‌ఎం శ్రీవాని పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట మోడల్‌స్కూల్‌లో మండల స్థాయి పోటీలు జరిగాయి. వాలీబాల్, ఖోఖో, 100, 200, 400 మీటర్ల పరుగుపందేలు నిర్వహించారు. 16 పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ బహుమతులు పంపిణీ చేశారు. ఎంఈఓలు చంద్రశేఖర్, రెడ్డెన్నశెట్టి, ప్రిన్సిపల్ లోకనాథం, అశోక్‌కుమార్, సర్పంచ్ జయరాం, పీడీలు శ్రీనివాసులు, నితీన్‌కుమార్, సాధిక్, ఆమని, శారద పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సదుం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు హెచ్‌ఎం సుబ్రమణ్యం శనివారం తెలిపారు. కంటి నిపుణులు నరసింహులు, శ్రావణి 674 మంది విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు చెప్పారు. ఇందులో 59 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారని వెల్లడించారు. వీరికి త్వరలోనే కంటి అద్దాలు అందజేస్తామన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

పుంగనూరు: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.కార్తీక్ అన్నారు. శనివారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సును ఎస్‌ఐ మోహన్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులవుతారని తెలిపారు. జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. న్యాయవాదులు హరినాథరెడ్డి, గాయిత్రి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి కార్తీక్

మద్యం వాహనం బోల్తా

చౌడేపల్లె: చౌడేపల్లె–సోమల మార్గంలోని కడియాలకుంట వద్ద మద్యం తరలిస్తున్న బొలెరో వాహనం శనివారం బోల్తాపడింది. పూతలపట్టు మద్యం డిపో పాయింట్ నుంచి మదనపల్లెకు వెళుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వాహనం బోల్తా పడడంతో మద్యం బాటిళ్లు పక్కనున్న పొలంలోకి పడ్డాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మద్యం డిపో అధికారులు, పుంగనూరు ఎక్సైజ్ అధికారుల సమక్షంలో వేరొక వాహనంలో మద్యం కేసులను మదనపల్లెకు తరలించారు.



బోల్తాపడిన బొలెరో వాహనం